# లేఖనములయందు వ్రాసియున్న సంగతులను అతిక్రమింపకూడదు

## (Do not go beyond what is written)

### ఉపోద్ఘాతం

దేవుని చిత్తమును గూర్చిన నిత్య వేదాంతములు యేసు ద్వారా కాలములో ప్రదర్శింపబడి, కొరింథీ సంఘములోని ''మానవ జ్ఞాన'' సమస్యను సంధించుటలో పౌలు ద్వారా పొందుపరచబడినవి. మనం ''లేఖనములయందు వ్రాసియున్న సంగతులను అతిక్రమింప'' (1 కొరింథీ. 4:6) వలసిన అవసరం ఎందుకు లేదో అభినందించుటకై దయచేసి 3వ భాగంలోని ఉపోద్ఘాతాన్ని మరియు గత రెండు పాఠాలను తిరిగి పరిశీలించండి.

కొరింథీ సంఘములో ఏమి జరుగుచుండెనో దానిని గూర్చి మనం చేసిన వివరణాత్మక పనిని గుర్తుంచుకోవడానికి 2వ భాగంలో రెండు మరియు నాలుగు పాఠాలను కూడా తిరిగి పరిశీలించండి. లేఖనాలు గ్రహీతలకు ఏం అర్థాన్నిస్తాయని మనం నేర్చుకున్నామో, అవే లేఖనాలు అదే అర్థాన్ని మనకిచ్చుటను గూర్చి మనం చేసే ఆలోచనను నియంత్రిస్తాయి. అదే సమయంలో, ఈ కొరింథీ నాటకంలో ఉన్న విరోధిని మనం జ్ఞాపకముంచుకోవాలి (1 కొరింథీ. 11:13-15). 1వ భాగం, మూడో పాఠంలో మనకు సాతాను మరియు వాని దొంగ అపొస్తలులు పరిచయం చేయబడ్డారు.

1 కొరింథీ పత్రికలో ఒకటి నుండి నాలుగు అధ్యాయాల వరకున్న వాక్య భాగంలో సమస్యను పరిష్కరించడానికి పౌలు బోధించిన సూత్రాలను నేర్చుకోవడమే ఈ పాఠంలో మన ఉద్దేశం. మనం ఈ దైవిక సూత్రాలను మన స్వంత జీవితాలలో ఎదుర్కొనే అదే రకమైన సమస్యలకు అన్వయించగలము.

### పాఠం

పౌలు ద్వారా చెప్పబడిన కొరింథీ సంఘములోని ఆత్మీయ ఎదుగుదల సమస్య:

*సహోదరులారా, ఆత్మ సంబంధులైన మనుష్యులతో మాటలాడినట్లు నేను మీతో మాటలాడలేకపోతిని. శరీర సంబంధులైన మనుష్యులే అనియు, క్రీస్తునందు పసిబిడ్డలే అనియు, మీతో మాటలాడవలసి వచ్చెను. అప్పటిలో మీకు బలము చాలకపోయి నందున పాలతోనే మిమ్మును పెంచితిని గాని అన్నముతో మిమ్మును పెంచలేదు. మీరింకను శరీర సంబంధులై యుండుట వలన ఇప్పుడును మీరు బలహీనులై యున్నారు కారా? మీలో అసూయయు కలహమును ఉండగా మీరు శరీర సంబంధులై మనుష్య రీతిగా నడుచుకొనువారు కారా? ఒకడు -నేను పౌలు వాడను, మరియొకడు -నేను అపొల్లోవాడను, అని చెప్పునప్పుడు మీరు ప్రకృతి సంబంధులైన మనుష్యులు కారా?*

*1 కొరింథీ. 3:1-4.*

పౌలు గతంలో వారికి బోధించిన స్థాయి చొప్పున సంఘముతో సహవాసము చేయుటకు తన అసక్తతను తెలిపిన తరువాత, వారి పరిస్థితి పట్ల వారి వ్యక్తిగత విశ్లేషణను తప్పు పట్టడానికి అతడు అలంకారిక ప్రశ్నలను సంధించాడు. దీని అర్థమేమిటంటే ఆత్మీయ సంగతులను ''ప్రకృతి సంబంధమైన మనుష్య'' ఆలోచనతోను ప్రవర్తనతోను ఎలా సరిపోల్చాలో వారికి తెలుసని పౌలు తలంచాడు. గత రెండు పాఠాలలో మనం అభ్యసించిన వాటిని పౌలు వారికి బోధిస్తూ పద్దెనిమిది నెలలు గడిపాడు. ఈ పత్రికలు వ్రాయబడుతున్న సమయంలో వారు **తమలో స్థిరపరచబడిన** దేవుని జ్ఞానం నుండి మనుష్య జ్ఞానానికి మారుచున్నారు (1 కొరింథీ. 1:6). వారు స్వంత జ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. ''సాంస్కృతిక సాపేక్షత'' అను ధ్వజము క్రింద నేడు సంఘాలలోని నాయకులు కొన్నిసార్లు ఇదే చేస్తున్నారు. ప్రబలమవుతున్న సంస్కృతితో తరచుగా సమానార్థకం అవుతున్న మానవ జ్ఞానం, దేవుని జ్ఞానం పట్ల క్రైస్తవులకు గ్రుడ్డితనం కలుగజేసినప్పుడు ఇది జరుగుతుంది. మనం చదువుతున్న పత్రిక యొక్క అసలు గ్రహీతలు ఏ సంస్కృతిలో పత్రికను పొందారో దానికి మనం సంబంధం కలవారమై యుండాలి; అయినప్పటికి, ఆత్మీయ విషయములన్నిటిలో, ''ఈ లోక జ్ఞానము దేవుని దృష్టికి వెఱ్ఱితనమే'' (1 కొరింథీ 3:19) అనే సంగతి మన మనస్సులో ఉంచుకోవాలి.

దేవుని పట్ల వారికున్న భక్తి మారటం వలన వారి ఆత్మీయత యొక్క ''ప్రకృతి సంబంధమైన మనుష్య'' స్థాయి దానికదే తెలియబడినది. వారు కేఫాతోను, అపొల్లోతోను మరియు పౌలుతోను తమకున్న భక్తిని మరియు ప్రత్యేక సంబంధాన్ని చెప్పుకుంటున్నారు. వారు బలవంతులైన వ్యక్తులవటం వలన వీరు ఆకర్షితులవు తున్నారు. క్లోయె ఇంటిలోని క్రైస్తవులు పౌలుకు సమస్యను తెలిపారు(1 కొరింథీ. 1:11, 12). ఉపదేశకులు మరియు బోధకులు చెప్పే సందేశం పట్ల కాకుండా, సందేశం చెప్పేవారికి వారు ప్రాముఖ్యతను ఇస్తున్నారు. ''దేవుని జతపనివారు''లో ఒకడుగా కాకుండా వారు అంతకంటే ఎక్కువగా తనను గురించి తలస్తున్నారని పౌలు భయపడ్డాడు (1 కొరింథీ. 3:9). అతడు, అపొల్లో దేవుని పొలాన్ని నాటి నీళ్లు పోసిన సేవకులే తప్ప ఇంకేమీ కాదు.

అయితే మరి కొరింథీ సంఘంలో జరుగుతున్న దాని నుండి మనం పొందే దైవిక సూత్రం ఏమిటి? దేవుని వాక్యాన్ని ప్రకటించి బోధించే వారి పట్ల మనకున్న భక్తిని పరిశీలించుకోవాల్సిన అవసరత వుంది. ఉపదేశకులు మరియు బోధకులు వారు పరిచర్య చేసే తీరులో వున్న తమ అహంకార తలంపులను పరిశీలించు కోవాల్సిన అవసరత వుంది. క్లోయె యింటివారు తెలియ జేసినట్లుగా ''క్రైస్తవ మత సమూహం'' అని చెప్పబడిన మాటలో ఏం జరుగుతుందో మరియు ఏం జరుగుతూ వస్తుందో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. ''వేదిక వర్తమానికులు'' లేకుండా బహు కొద్ది మత బృందాలు మాత్రమే పని చేస్తున్నాయి. ఖచ్చితంగా పౌలు ఈ విషయంతోనే యుద్ధం చేస్తున్నాడు (1 కొరింథీ. 2:4, 5).

ఆదివారం ఉదయకాలం ప్రసంగాలు చెప్పే ప్రసంగికుని ఉద్రేక భావాల చేత కూడుకునే మత గుంపులు ఉద్రేకం ఆధారంగా పని చేస్తున్నాయే తప్ప మానవాళి కొరకైన దేవుని చిత్తంలోని సూత్రాల ప్రకారం కాదు. దేవుని క్రొత్త నిబంధనకు తమ్మును తాము అంకితం చేసుకునే ప్రతి ఒక్క సభ్యుని చేత క్రీస్తు సంఘం కూడుకోవడం జరుగుతుంది (ఎఫెసీ. 4:14-16; 1 పేతురు. 4:10). పిల్లలు తమ ఉద్రేకాలపై ఆధారపడి జీవితాన్ని సమీపిస్తారు. వారిలాంటి ఇతరులతో ఉన్న సహవాస సూత్రాలపై వారు పని చేయడం తర్ఫీదు పొందనంత వరకు వారు "నాకు కావాలి" అనే సంధింపును జీవితం పట్ల కలిగియుంటారు. కొంతమంది సంఘసభ్యులతో పౌలు, "సహోదరులారా, మీరు బుద్ధి విషయమై పసిపిల్లలు కాక దుష్టత్వము విషయమై శిశువులుగా ఉండుడి" (1 కొరింథీ. 14:20) అని చెప్పాడు. "జ్ఞానము ఉప్పొంగజేయును గాని ప్రేమ క్షేమాభివృద్ధి కలుగజేయును" (1 కొరింథీ. 8:1)అను వాక్యములో క్రీస్తు శరీర మందలి సహవాస సూత్రములు చెప్పబడ్డాయి. "ఏ విధముచేతనైనను కొందరిని రక్షింపవలెనని అందరికి అన్ని విధముల వాడనైయున్నాను" (1 కొరింథీ. 9:22) అని పౌలు చెప్పాడు.

అహం యొక్క సమస్యయైన అతిశయం దేవుని ప్రజల సమాజములో నాయకత్వ మంతటికి వ్యాపించింది. "ప్రాముఖ్యమైన పేర్ల" చుట్టూ తిరగడం ప్రారంభించిన నాయకుల చుట్టూ సభ్యులు తిరుగుతున్నారు. "నేను క్రీస్తువాడనని" కొంత మంది చెప్పిననూ తమ నిమిత్తం శిష్యుల్ని విడదీయడమే వారి ఉద్దేశం. అనైతిక విధానంలో ప్రభురాత్రి భోజనంలో పాలుపొందే వారికి సంబంధించి క్రింది మాటలో అహంకార పూరిత నాయకత్వ (egotistical leadership) ఉద్దేశంపై పౌలు వేలెత్తి చూపిస్తున్నాడు.

*మొదటి సంగతి యేమనగా, మీరు సంఘమందు కూడియున్నప్పుడు మీలో కక్షలు కలవని వినుచున్నాను. కొంతమట్టుకు ఇది నిజమని నమ్ముచున్నాను. మీలో యోగ్యులైన వారెవరో కనబడునట్లు మీలో భిన్నాభిప్రాయములుండక తప్పదు. 1 కొరింథీ. 11:18, 19.*

తమ చుట్టూ ప్రజల్ని పోగుచేసుకోవాలని ఆశించు బలమైన చిత్తం గల నాయకులు తమ నాయకత్వం నిజమైనదని వారికి దేవుని అంగీకారం ఉందని చెప్పుకోవాల్సిన అవసరమున్నది. వారు ప్రత్యేకంగా కొంత మంది ప్రజలకు అన్వయించబడే కొన్ని సిద్ధాంతాలను ఎన్నుకొని అలాంటి వేరు సిద్ధాంతాలలో ఉన్న ఇతరుల నుండి వ్యత్యాసంగా కనబడు నిమిత్తం ఈ అంశాలలో వారు తమ విశ్వాసాన్ని కనబరుస్తారు. ఈ రకంగా, వారి సొంతజ్ఞానం ద్వారా సత్యం కొరకు నిర్ణయించ బడిన కొలతల చుట్టూ తిరగడం ద్వారా వివిధ గుంపులు రూపొందుతున్నాయి. ఈ జ్ఞానం తరచూ సంస్కృతి ద్వారా రూపమేర్పరచు కొంటుంది; అయినప్పటికి, మేము దేవుని సత్యాన్ని బోధిస్తున్నామని వారు ప్రకటిస్తారు. ఇది పేరుపెట్టు (denominate) కార్యమై యున్నది. ఈ సంగతిని ఉదహరించటానికి, తన పరచులో ఉన్న కాగితపు ధనాన్ని వరుసగా ఏర్పాటు చేస్తాడు. ఒక్కొక్క వరుసను ఇది పది, ఇది ఇరవై అని అతడు పేరుపెడతాడు.

వెబ్‌స్టర్ డిక్షనరీ (Webster Dictionary) ప్రకారం సంప్రదాయమాత్రమైన నిష్ఠ (denominationalism) యొక్క నిర్వచనం, "శాఖాపరమైన సూత్రాల పట్ల ఆసక్తి కలిగియుండు భక్తి." శాఖాపరమైన తేడాలను సంకుచిత ఆలోచనలో ఒక మతంలో వేర్వేరు తెగల పోరాటముగా (sectarianism) నొక్కి ఒక్కాణించడము. 1వ కొరింథీ పత్రిక యొక్క మొదటి నాలుగు అధ్యాయాల ఉద్దేశం ఏమిటంటే "కొరుకుడు పుండు వంటి ఈ సమస్యను మొగ్గలోనే త్రుంచివేయడ"మైయున్నది. సులువైన పరిష్కారం: "యేక మనస్సుతోను ఏక తాత్పర్యముతోను, మీరు సన్నద్ధులై యుండవలెనని." బైబిలు వాఖ్యాన సూత్రాలను సాధకం చేసే నైపుణ్యాన్ని వృద్ధిచేసుకోవడం ద్వారా క్రైస్తవులు దీనిని చేస్తారు.

దేవుని వాక్యం మనకు సాహిత్య రూపంలో ఇవ్వబడింది. మనం సాహిత్యాన్ని చదివే సూత్రాలను తప్పక నేర్చుకోవాలి. అసలైన గ్రహీతలకు కొరింథీ పత్రికలు ఏమి భావాన్నిచ్చాయో, మనం నేర్చుకుంటున్నాము. అయితే మనం నేర్చుకున్న విషయం నేడు అవి మనకేమి భావాన్నిస్తాయో నియంత్రించునట్లు చేద్దాం. మన రక్షణయందు మనం కలిగిన విశ్వాసం నిమిత్తము మనం ఇతరుల పై ఆధారపడము. పాండిత్యముగల ప్రజల్ని మనం అభినందిస్తాం. మనం "మీకు (మనకు) దేవుని వాక్యము బోధించి, మీ (మన) పైని నాయకులుగా ఉన్నవారిని జ్ఞాపకము" చేసికొంటాము (హెబ్రీ. 13:7). మనం వారి జీవిత విధానంలోని ఫలమును జాగ్రత్తగా చూచి దేవుని వాక్యమునందున్న వారి విశ్వాసమును అనుకరిస్తాము. "యేసుక్రీస్తు నిన్న, నేడు, ఒక్కటే రీతిగా ఉన్నాడు" (హెబ్రీ. 13:8). క్రైస్తవులు యేసుకే శిష్యులు, ఇంకెవ్వరికీ శిష్యులు కాదు. తన కొరకు శిష్యుల్ని తయారు చేసుకోవాలని ఆశపడే నాయకుడు దేవుని సంఘమందు విభజనకు కారణమవుతాడు. బోధకుడు లేక ఉపదేశకుని యొక్క శిష్యులు సంఘములో విభజనను ఎత్తిపట్టుకొనుటకు కారణ మవుతారు.

అంతరంగ/బాహ్యపురుషుని ఆత్మీయ కోణాన్ని గూర్చి కొరింథీయులకు బాగుగా బోధించబడింది (2 కొరింథీ. 4:16-18). "ఈ లోకపు నటన గతించుచున్నది" అని వారికి తెలుసు (1 కొరింథీ. 7:31). అయినను, వారు "హృదయమునందు అతిశయ పడక పై రూపమునందే అతిశయపడు"తుండటం ప్రారంభించారు (2 కొరింథీ. 5:12). కొంత మంది తమ్మును తామే మెచ్చుకొను కొందరితో జతపరచుకొనుటకై వారితో వారు సరిచూచుకొనుచున్నారు (2 కొరింథీ. 10:12).

వారికి అహం సమస్యగా ఉండి అది సంఘాన్ని విభజిస్తుంది. మీలో "కొందరు ఉప్పొంగుచున్నారు" (1 కొరింథీ. 4:18) అని పౌలు వ్రాసాడు. "దేవుని చిత్తానికి" దూరమవ్వటానికి ఇది ప్రారంభపు మెట్టు. "దేవుని చిత్తము వలన యేసుక్రీస్తు యొక్క అపొస్తలుడుగా నుండుటకు

పిలువబడిన పౌలు" యొక్క చిత్తానికి లోబడుటకు కొంత మంది ఏమాత్రమును ఇష్టపడుటలేదు (1 కొరింథీ. 1:1). వారు ప్రమాదభరితమైన మార్పైన **-ఇష్టంనుండి నుండి మూర్ఖపు పట్టులోనికి** వెళ్లారు. ఇష్టపూర్వకమైన పాపం ఒక క్రైస్తవుడ్ని సిలువ యొక్క కృపల నుండి దూరం చేస్తుంది (హెబ్రీ. 10:6). వారు దేవుని రాజ్యాన్ని విభజించుటకు ప్రయత్నించుచున్నారు. కొరింథునందున్న దేవుని ఆలయాన్ని విభజించగలము అన్నట్లు విభజించుటకు ప్రయత్నిస్తున్నారని నేరం మోపబడు ప్రమాదంలో వారు ఉన్నారు. నేడు సంఘ నాయకులు యేసు ఏర్పాటు చేసిన గురిని అంగీకరించ వలసిన అవసరం ఉంది.

"మీరందరు ఏకభావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలు లేక, యేక మనస్సుతోను ఏక తాత్పర్యముతోను" (1 కొరింథీ. 1:10) అనే మాట తప్పించి క్రైస్తవ ప్రజలు ఇంక దేనినైనా అర్థం చేసుకోగలుగుతారు. దీనికి తగ్గిన దేదైనా సంఘ ఉద్దేశమైన దైవ శరీరమును నాశనం చేస్తుంది. ఒక్క శిరస్సు, ఒక్క శరీరం మాత్రమే ఉన్నాయి (1 కొరింథీ. 12:12, 13). ఒకే సత్యమున్నది కాబట్టి "మేము సత్యమునకు విరోధముగా ఏమియు చేయనేరము గాని, సత్యము నిమిత్తమే సమస్తమును చేయుచున్నాము" (2 కొరింథీ 13:8).

పౌలు తన ప్రారంభ ప్రార్థనలో సమస్యను సరిచేయడానికి పనిచేయడం ప్రారంభించాడు (1 కొరింథీ. 1:4-9). వారి సమస్య వారి వ్యక్తిగత మనస్సులలోను మరియు హృదయాలలోను ఉంది, అంతేగాని వారికి బయట ఎక్కడో లేదు; కాబట్టి, వారెక్కడ ఉన్నారో, వారేమి పొందారో మరియు దానితో ఆ సమయంలో వారేమి చేస్తున్నారో వారు చూడగలుగునట్లు పౌలు ఒక మానసిక ప్రదేశాన్ని ఏర్పాటు చేసాడు. మనుష్యుల కొలత వలన చూస్తే, వారు సామాన్య ప్రజల నుండి వచ్చారు (1 కొరింథీ. 1:26). బహుశా, వారిలో చాలా మంది గ్రీకు భాష మాట్లాడు అన్యులైయుంటారు. కొంత మంది ఇతర కార్యాలతో పాటు కొన్ని తీవ్రమైన అనైతిక సమస్యలను కలిగి యుండిరి; అయినను, ఇప్పుడు వారు దేవుని కృపవలన పరిశుద్ధులైయున్నారు (1 కొరింథీ. 6:9-11). పౌలు బోధించిన సువార్తలోని సంపూర్ణ కృప మరియు వివిధ ఆత్మీయ వరములతో దేవుడు వారిని దీవించాడు (1 కొరింథీ. 12:7-11; 12:11-13). ఈ పత్రిక వ్రాయబడుతున్న సమయంలో కొంత మంది స్పష్టమైన మతి మరుపుతో బాధపడుచున్నారు -అంటే తమ స్వంత సామర్థ్యాలను బట్టి జీవితంలో క్రొత్తగా నిలబడే స్థితి వారికి వచ్చినట్లు వారు అతిశయపడుతున్నారు (1 కొరింథీ. 4:7).

ప్రత్యేకంగా 2వ భాగం, రెండవ పాఠంలో ఈ లేఖనాలపై మనం చేసిన చారిత్రాత్మక మరియు సాహిత్యపరమైన విశ్లేషణ వెలుగులో దయచేసి ఈ ఏర్పాటును పరిగణించండి. అనగా ఇది వ్యాఖ్యాన సంబంధ విషయం. మనం ఇక్కడ చెప్పాలనుకుంటున్నది మనం "క్రమం -తప్పినప్పుడు" (off-track) చాలామంది క్రైస్తవులకు ఆ విషయం తెలుస్తుందని. లోకంలో మనమెక్కడ ఉన్నాం, "క్రీస్తునందు"న్న మన నూతన జీవిత ప్రారంభములో దేవుని చిత్తాన్ని గూర్చి, దేవుని జ్ఞానాన్ని గూర్చి మరియు దేవుని కృపను గూర్చి మనం ఏం అర్థం చేసుకున్నాం -అలాగే ఇప్పటి కిప్పుడు మనమెక్కడ నిలబడ్డాం అనే విషయాలను మనం ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. ఈ విషయాలన్నిటిని మనం ఆలోచించునట్లు లేఖనాలు మనకు సహాయపడ్తాయి. వారు ఐశ్వర్యవంతులు గాను రాజులుగాను ఉన్నట్లు నటిస్తుండే స్థితికి వారెక్కడ నుండి వచ్చారో వారు తమ్ముము గూర్చి తామే ఆలోచించుకొనునట్లు సహాయం చేయడానికి పౌలు పత్రికలు ఉద్దేశించబడ్డాయి (1 కొరింథీ. 4:8).

ఒకటి నుండి పది వరకు ఉండే కొలబద్దపై, దేవుని జ్ఞానంతో మనుష్య జ్ఞానాన్ని కొలిచినప్పుడు మనుష్య జ్ఞానం సరిపడలేదు.

> *ఎవడును తన్నుతాను మోసపరచుకొనకూడదు. మీలో ఎవడైనను ఈ లోకమందు తాను జ్ఞానినని అనుకొనిన యెడల, జ్ఞాని అగునట్టు వెఱ్ఱివాడు కావలెను. ఈ లోక జ్ఞానము దేవుని దృష్టికి వెఱ్ఱితనమే. -జ్ఞానులను వారి కుయుక్తిలో ఆయన పట్టుకొనును; మరియు -జ్ఞానుల యోచనలు వ్యర్థములని ప్రభువునకు తెలియును అని వ్రాయబడి యున్నది. కాబట్టి యెవడును మనుష్యులయందు అతిశయింపకూడదు.* 1 కొరింథీ. 3:18-21.

పౌలు కొరింథుకు వెళ్లే తన మూడవ పర్యటనలో రోమా పత్రికను వ్రాసాడు. రోమా పత్రికలోని మొదటి అధ్యాయం యొక్క చివరి సగంలో, అతడు ప్రస్తావించిన విషయాన్ని గూర్చి మరింత వివరంగా చెప్పాడు. ఆ విషయం: "లోకము తన జ్ఞానము చేత దేవునిని ఎరుగకుండినందున" (1 కొరింథీ. 1:21). యేసును వ్యక్తిగతంగా తెలుసు కోవడాన్ని బట్టి దేవుడ్ని ఒక వ్యక్తిగా తెలుసుకోవడమనేది మన ఆత్మీయ ఎదుగుదలకు చాలా ప్రాముఖ్యమైనది (హెబ్రీ. 1:3). వారు మేధావులు మరియు తలాంతులు గల ప్రసంగీకులైనప్పటికిని,"మనుష్యులను అనుసరించేవారుగా మారడం" మరియు "అతిశయించుటం" అనే వాటికి దూరంగా వెళ్లిపోవడానికి ఇదే మార్గం.

ఒక పురుషుడ్ని గాని స్త్రీని గాని దేవుని సంఘ సభ్యులు తమ సహవాస ఆకర్షణతో స్వీకరించడం ప్రారంభించినప్పుడు, వారు "లేఖనములయందు వ్రాయబడిన సంగతులకు" దూరంగా వెళ్లిపోతున్నారనేది తప్పకుండా ఒక హెచ్చరికయై యుండాలి. "మా వర్తమానికుడు" అని గాని లేక "వేదిక మీద నున్న వ్యక్తి"కి ఒక హోదానివ్వడానికి వారుపయోగించు ఏ పదజాలంతోనైనా సరే వారు అతిశయించడం ప్రారంభించినప్పుడు, ఇరవై ఒకటవ శతాబ్దంలో మనకు కొరింథీ సమస్య ఉన్నదని అర్థమవుతుంది. ఇది మొదటి శతాబ్దం నుండి, "క్రైస్తవ మత ప్రపంచం" అనే మాటను కలుషితం చేసేసింది.

## చర్చ కోసం ప్రశ్నలు

1. మనం క్రైస్తవ వేదాంతాన్ని తెలుసుకొనుటకు దేవుడు ఎలా ఏర్పాటు చేసాడు?

2. కొంత మంది కొరింథీ సంఘ సభ్యులకు దేవుని వాక్యాన్ని స్వీకరించటానికి చాలినంత ఆత్మీయ స్థితి లేదనే ముగింపుకు పౌలు ఎలా వచ్చాడు?
3. పౌలు అలంకారిక ప్రశ్నలను సంధించాడనే వాస్తవం తన పత్రిక గ్రహీతల అవగాహనా స్థాయిని గూర్చి ఏమి సూచిస్తుంది?
4. అపొస్తలుడైన పౌలు వంటి దేవుని జతపనివారి చుట్టూ తిరగడంలో తప్పేముంది?
5. పెద్దవారైన ప్రజలు దేనిని ఆధారంగా చేసుకుని పని చేస్తారు:

   ఎ. సూత్రాలు. బి. ఉద్రేకాలు.
6. కొరింథీ సందర్భంలో ఎలా "జ్ఞానము ఉప్పొంగజేయు"నో వివరించండి.
7. కొరింథీ సమస్య సందర్భంలో, కొంతమంది "నేను క్రీస్తువాడనని" చెప్పుకుంటున్న తీరులో తప్పు ఏమిటి?
8. సంఘంలో ఉన్న అతిశయ సమస్యకు మరియు విభజన సమస్యకు సంబంధించి 1 కొరింథీ. 11:18,19లో పౌలు ఎలా వ్రాసుంటాడు?
9. డబ్బును ఏర్పాటు చేసుకునే విషయంలో "వేరుచేయుట" (denomination) అనే పదాన్ని వివరించండి. ఇది మతంలో సాంప్రదాయమాత్రమైన నిష్ఠకు ఎలా సంబంధించినదై యుంటుంది?
10. కొరింథీ సమస్య వెలుగులో బైబిలు వ్యాఖ్యాన సూత్రాలను సాధకం చేయటం ఎందుకని ప్రాముఖ్యం?